# బీఆర్ఎస్ పార్టీ అన్నింటా ఫస్టే

**కాంగ్రెస్ , బీజేపీ నాయకులను తరిమికొట్టాలి**

**ఇల్లెందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్**



గార్ల మండలం శేరిపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్

గార్ల, అక్టోబర్ 26 : సీఎం కేసీఆర్ నేతృత్వంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించడంలో బీఆర్ఎస్ పార్టీ అన్నింటా ఫస్టే అని ఇల్లెందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియా నాయక్ అన్నారు. గురువారం మహబూబాబాద్ జిల్లా గార్ల మండలంలోని బాలాజీ తండా, శేరిపురం, పినిరెడ్డిగూడెం, గోపాలపురం, చిన్న బంజర గ్రామాల్లో ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే హరిప్రియానాయక్ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే హరిప్రియా నాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలల్లో అగ్రగామి నిలిపిన సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ విజయం సాధిస్తాడని అన్నారు. రైతులకు మూడు గంటల కరెంట్ చాలు అని పిచ్చి కూతలు కూసిన కాంగ్రెస్ పార్టీ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి ప్రజలు గుణపాఠం చెప్పానున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు అభివృద్ధి వైపు, సీఎం కేసీఆర్‌కు మద్దతుగా ఉన్నట్లు వివరించారు. గ్రామాల్లో తిరిగే కాంగ్రెస్, బీజేపీ నాయకులకు ప్రజలు తరిమికొట్టాలని అన్నారు. ఎన్నికల తర్వాత కాంగ్రెస్, బీజేపీ పార్టీల అడ్రస్ ఉండదని అన్నారు. ప్రజా అదరణతో రెండోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న రాంపురం పాకాల ఏటిపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.15 కోట్లతో శంకుస్థాపన చేశామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న బీఆర్ఎస్ పార్టీకే ఓట్లు అడిగే హక్కు ఉందన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీల మాయమాటలు నమ్మి మోసపోవొద్దని అన్నారు. సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలు గడపగడపకూ వచ్చినట్లు వివరించారు. సీఎం కేసీఆర్ ఎన్నికల మ్యానిఫెస్టో పేద మధ్యతరగతి ప్రజలకు ఎంతోగానో ఉపయోగ పడుతుందన్నారు. నవంబరు ఒకటో తేదీన ఇల్లెందులో జరిగే సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు 10 వేల మంది కార్యకర్తలు తరలిరావాలన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి భార్టీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ అంగోత్ బిందు, ఎంపీపీ మూడు శివాజీ చౌహన్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు పానుగంటి రాధాకృష్ణ, బయ్యారం బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తాతా గణేశ్, ఎంపీటీసీ శీలంశెట్టి రమేశ్, సర్పంచ్‌లు శంకర్, భద్రూనాయక్, జ్యోతి, భూక్యా భారతి, ఉషానాయక్, బీసీ సెల్ అధ్యక్షుడు తోట కొండల్‌రావు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ పార్టీకి ఓటుతో బుద్ధి చెప్పాలి: హరిప్రియ**

ఇల్లెందు, అక్టోబర్ 26: రైతుబంధు పథకాన్ని అమలు కాకుండా ఆపాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ పార్టీకి రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం ఆమె ఇల్లెందులో విలేకరులతో మాట్లాడారు. కొన్ని రోజుల్లో ఎండాకాలం పంట ప్రారంభం కానున్నదని, ఈ సమయంలో రైతులకు పెట్టుబడి సాయం అందక పోతే తీవ్ర ఇబ్బంది పడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఇబ్బందులను గ్రహించకుండా రైతుబంధును ఆపాలని చూడటం కాంగ్రెస్ పార్టీ నీచమైన బుద్ధికి నిదర్శనమని విమర్శించారు. ఎన్నికల కోడ్‌కు సంబంధం లేదని తెలిసి కూడా ఫిర్యాదు చేశారంటే కాంగ్రెస్ నాయకులకు రైతుల మీద ఎంత ప్రేమ ఉందో అర్థమవుతుందని తెలిపారు. 60 ఏళ్లు రైతులను, ప్రజలను వంచించిన కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో డిపాజిట్లు దక్కకుండా ఓడించాలని పిలుపునిచ్చారు.

**రైతుబంధును అడ్డుకునేందుకు కాంగ్రెస్ కుట్ర: జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల**



టేకులపల్లి: మాట్లాడుతున్న దిండిగాల రాజేందర్

టేకులపల్లి, అక్టోబర్ 26: రాష్ట్రంలో రైతుల ఇబ్బందులు చూసిన సీఎం కేసీఆర్ రైతుల పక్షాన నిలిచి వారి సంక్షేమం కోసం రైతుబంధు పథకం ప్రవేశపెట్టారని, దానిని అడ్డుకునేందుకు కాంగ్రెస్ కుట్రపూరితంగా ఎన్నికల అధికారులకు రైతుబంధు ఆపాలని లేఖ ఇవ్వడం దుర్మార్గమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్ అన్నారు. గురువారం టేకులపల్లిలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నవంబర్ 1వ తేదీన ఇల్లెందులో జరిగే ప్రజా ఆశీర్వద సభలో ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరవుతున్నందున సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇల్లెందు చరిత్రలో ఎప్పుడు జరుగని రీతిలో 75 వేల మందితో జరిగే సభకు మండలం నుంచి 15వేల మందిని తరలించాలని నాయకులను, కార్యకర్తలను కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బానోత్ హరిసింగ్‌నాయక్, టీబీజీకేఎస్ నాయకుడు రంగనాథ్, మండల అధ్యక్ష, కార్యదర్శులు వరప్రసాద్‌గౌడ్, బోడ బాలునాయక్, బానోత్ రామనాయక్, కిషన్‌నాయక్, చీమల సత్యనారాయణ, బట్టు శివ, జేకే శ్రీను, జర్పుల లచ్చునాయక్, బర్మవత్ శివకృష్ణ, ఉండేటి బసవయ్య, కుమ్మరి కిరణ్, ఏ రేణుక పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యను కలిసిన ఎంపీ వద్దిరాజు



అబ్బయ్యతో మాట్లాడుతున్న ఎంపీ రవిచంద్ర

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 26: మాజీ ఎమ్మెల్యే ఊకే అబ్బయ్యను రాజ్యసభ సభ్యుడు, ఇల్లెందు ఎన్నికల ఇన్‌చార్జి వద్దిరాజు రవిచంద్ర గురువారం మండలంలోని సుదిమళ్ల గ్రామంలోని అబ్బయ్య స్వగృహంలో ఆయనను కలిశారు. ఆరోగ్య క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. బీజేపీలో కొనసాగుతున్న అబ్బయ్యను బీఆర్ఎస్‌లోకి రావాలని ఆహ్వానించారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న అబ్బయ్యను బీఆర్ఎస్‌లో చేరి ఇల్లెందుతో పాటు తెలంగాణలో జరుగుతున్న సమగ్రాభివృద్ధికి మరింత చేయూతనివ్వాలని సూచించారు. ఎంపీ వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, బీఆర్ఎస్ నాయకులు జానీ, రంగనాథ్, జేకే శ్రీనివాస్, సిలివేరు సత్యనారాయణ, హరిసింగ్‌నాయక్ ఉన్నారు.

## పోలీసుల త్యాగాలు మరువలేనివి: డీఎస్పీ



రక్తదానం చేస్తున్న డీఎస్పీ రమణమూర్తి

ఇల్లెందు, అక్టోబర్ 26: శాంతి భద్రతల పరిరక్షణలో అసువులు బాసిన పోలీసుల త్యాగాలు మరువలేనివని డీఎస్పీ ఎస్వీ రమణమూర్తి అన్నారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ విధినిర్వహణలో ఎంతోమంది పోలీసులు చేసిన ప్రాణత్యాగాలు పోలీస్ శాఖ గుర్తుంచుకుంటుందన్నారు. పగలు,రాత్రి తేడా లేకుండా పోలీసులు చేస్తున్న సేవలను అభినందిస్తున్నానన్నారు. ఇతర రాష్ట్రాల కంటే తెలంగాణ రాష్ట్రంలో పోలీసులకు అనేక సంక్షేమ పథకాలతో పాటు సౌకర్యాలు, సదుపాయాలు మెరుగ్గా ఉన్నాయన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలతో ఫ్రెండ్లీ పోలీసులుగా వ్యవహరిస్తూ వారి సమస్యలను తీర్చే దిశలో తెలంగాణ పోలీసులు దేశంలో నెంబర్ వన్‌గా ఉన్నారన్నారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం షీ టీమ్స్‌లను ఏర్పాటు చేసి వారిని కంటికి రెప్పలా కాపాడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఇల్లెందు సీఐ కరుణాకర్, సబ్ డివిజన్ సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎం సభాస్థలిని పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి



సభాస్థలిని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి

ఇల్లెందు, అక్టోబర్ 26: నవంబర్ 1న ఇల్లెందులో జరుగనున్న సీఎం కేసీఆర్ సభ ప్రాంగణాన్ని ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు గురువారం పరిశీలించారు. మండలంలోని బొజ్జాయిగూడెం గ్రామ పంచాయతీ మోదుగులగూడెం మదర్సా వద్ద గల సభా స్థలిని పరిశీలించి ఏర్పాట్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభా స్థలంలో హెలీప్యాడ్ స్థలం, సభా ప్రాంగణం, ప్రయాణ రాకపోకలు, ప్రజలకు ఏర్పాటు చేసే సౌకర్యాలను పరిశీలించామన్నారు. సీఎం కేసీఆర్ సభకు వేలాదిగా ప్రజలు రానున్న తరుణంలో పకడ్బందీగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఆయన వెంట గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బంది, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

## ప్రమాదాలు జరుగని సింగరేణిగా తీర్చిదిద్దుదాం







ఇల్లెందు రూరల్: పరికరాలను పరిశీలిస్తున్న పక్షోత్సవాల కన్వీనర్ సుశాంత్, ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు, టేకులపల్లి: ట్రోఫీని గని సిబ్బందికి అందజేస్తున్న కన్వీనర్

టేకులపల్లి, అక్టోబర్ 26: సింగరేణి వ్యాప్తంగా ఎటువంటి ప్రమాదాలు జరగని సింగరేణిగా తీర్చిదిద్దేందుకు అందరూ భాగస్వాములు కావాలని సింగరేణి జీఎం (ఎడ్యుకేషన్) కన్వీనర్ ఎన్ వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని ఇల్లెందు సింగరేణి ఏరియా కోయగూడెం ఉపరితల గనిలో 54వ వార్షిక రక్షణ పక్షోత్సవాలను ఆయన ప్రారంభించారు. తొలుత భద్రత జెండాను గని ఆవరణంలో ఎగరవేసి ఉద్యోగులతో రక్షణ ప్రతిజ్ఞ నిర్వహించారు. అనంతరం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రక్షణ సూత్రాలను పాటిస్తూ రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలన్నారు. అదేవిధంగా వార్షిక రక్షణ ఉత్సవాలను పురస్కరించుకొని ఉద్యోగులకు క్విజ్, ట్రేడ్ టెస్ట్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం గనిలోని అన్ని విభాగాలను తనిఖీ చేసి వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్, పీవో ప్రహ్లాద్, శంకర్‌రావు, బాలాజీనాయుడు, శ్రీనివాసు, నర్సింహరాజు, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

**ఎంవీటీసీలో ..**

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 26: సింగరేణి 54వ వార్షిక రక్షణ పక్షోత్సవాలను పక్షోత్సవాల కన్వీనర్ సుశాంత్ సహా గురువారం పరిశీలించారు. తొలుత ఎంవీటీసీలో భద్రత జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు విధుల్లో రక్షణను పాటించాలన్నారు. సింగరేణి కార్మికుడి సంక్షేమమే సంస్థ లక్ష్యమన్నారు. అనంతరం మోడల్ రూమ్, లైబ్రరీ, యోగా రూమ్, గ్యాస్ రూమ్, అండర్ గ్రౌండ్ గ్యాలరీస్, తరగతి గదులు, రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌వోటూజీఎం మల్లారపు మల్లయ్య, కమిటీ సభ్యులు ఎంవీఎన్ఎస్ ప్రసాద్, రజా హుస్సేని, మహేశ్, శ్యామ్‌సన్ , ఉద్యోగులు పాల్గొన్నారు.

**ఇల్లెందు ఏరియా జేకే ఓసీలో..**

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 26: సింగరేణి వార్షిక భద్రతా పక్షోత్సవాలను పండుగలా జరుపుకోవాలని ప్రాజెక్టు ఆఫీసర్ బొల్లం వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం ఇల్లెందు ఏరియా జేకే ఓసీలో 54వ వార్షిక పక్షోత్సవాల జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధులను ఏకాగ్రతతో నిర్వహించుకోవాలని, అందరూ రక్షణ పనిముట్లు ధరించాలన్నారు. 'నా భద్రత – నా కుటుంబ బాధ్యత' అనే నినాదంతో ఎటువంటి ప్రమాదాలు జరుగకుండా అప్రమత్తంగా పనిచేయాలన్నారు. అనంతరం ఉద్యోగులతో రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అధికారులు పూర్ణచందర్, శివప్రసాద్, చిన్నయ్య, సుధాకర్, ఉద్యోగులు పాల్గొన్నారు.